సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ





నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది, కమిషనర్, ఎంజీఐటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మణికొండ: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యతనే అందరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేసిన పుడే భవిష్యత్తులో అందరూ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ సత్యబాబు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే స్వీపర్లు, మున్సిపల్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతినటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలు, చెరువులు, కుంటలు, వాగులను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ కేంద్రాల్లో ఉత్తమంగా పని చేస్తున్న 17వ వార్డుకు మొదటి బహుమతి, 11,13 వార్డులకు రెండో బహుమతి, 8వ వార్డుకు మూడో బహుమతి అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉషారాణి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ లచ్చిరాం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఇంజనీరింగ్ కళాశాలల్లో...

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ), చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్రి బయోడైవర్సిటీ పార్కులో..

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అగ్రి బయోడైవర్సిటీ పార్కులో అటవీ వ్యవసాయం విభాగంలో వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పరిశోధన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ జీవ వైవిధ్య పైలాన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, అటవీ వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు వి సుధారాణి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సీమ, అధికారులు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రస్తుత పరిస్థితులలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి భూమి కాలుష్యాన్ని అరికట్టాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా 400 మిలియన్ టనుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని వాటిలో కేవలం 1 శాతం మాత్రమే రీసైక్లింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ విజన్‌తోనే కరెంటు కష్టాలు దూరం

ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్. చిత్రంలో కలెక్టర్ హరీష్

శంషాబాద్ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతోనే కరెంటు సమస్యలు తొలగిపోయాయని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని మదన్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరీష్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా బీఆర్ఎస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. కుల వృత్తులకు ఉచిత కరెంటు సరఫరా చేస్తున్న ఘనత తెలంగాణకు దక్కుతుందన్నారు. విద్యుత్ రంగంలో వచ్చిన మార్పులు, సంస్కరణలు, సాధించిన పురోగతిపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఈ గోపయ్య, ఆర్డీఓ చంద్రకళ, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, వైఎస్ ఎంపీపీ నీలం, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు శుభాకాంక్షలు



అక్కిరాజు సుబ్బారావు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ కవిత

రాజేంద్రనగర్: తెలంగాణ జాగృతి నాయకుడు అక్కిరాజు రాధేశ్యాం కుమార్తె సాహితీ మానస వివాహం చైతన్య అమర్‌కుమార్‌తో మే 26న జరిగింది. ఈ వివాహానికి హాజరు కావాల్సిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం కోకాపేట్‌లో జరిగిన బీఆర్ఎస్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఆమె అక్కడి నుంచి నేరుగా బుద్వేల్ టీచర్స్ కాలనీలోని రాధేశ్యాం ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించి వారితో సరదాగా గడిపారు. వారి విద్య, ఉద్యోగం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ కవిత బుద్వేల్‌కు వచ్చినట్లు తెలియడంతో పరిసర ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, ముర్తుజా ఆలీ, నయీం, విజయ్‌కుమార్, బంగి శ్రీను, మహాత్మ, జగదీష్, సాయిమాలిక్, లక్ష్మి, నర్సింహ్మా, కృష్ణమాచారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

శంషాబాద్: కేంద్ర పార్లమెంట్ వ్యవహారాలు, బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆయనకు స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. స్వాగతం పలికిన వారిలో శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు కిట్లను అందజేస్తున్న త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరీ

శంషాబాద్: టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌బీనగర్‌లో టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. టీబీ రోగులకు చేయూతనందించేందుకు త్రినేత్ర ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరీ, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, కౌన్సిలర్లు పుష్పత, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బండ్లగూడ: ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదాన్ కళాశాల ఆవరణలో పెండింగ్ చలాన్లపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనంతరం సీఐ కృష్ణ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వెల్లి విరిసిన ఆధ్యాత్మికత



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, గొలిదొడ్డి గ్రామాల్లో సోమవారం ఆధ్యాత్మికత వెల్లి విరిసింది. కోకాపేటలో శ్రీ రేణుక ఎల్లమ్మ, గండిమైసమ్మ, శ్రీ భూ లక్ష్మీదేవి, సమేత బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. గొలిదొడ్డిలోని వివేకానందనగర్ కాలనీలో మైసమ్మ, పోచమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. గొలిదొడ్డిలో జరిగిన పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు డి. రేఖయాదగిరి, వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూప నగేష్ యాదవ్ దంపతులు, కోకాపేటలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీకి పర్యావరణ అవార్డు



అవార్డు అందుకుంటున్న మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్

మణికొండ: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి జరిగే ముప్పును నివారించేందుకు కృషి చేసిన మణికొండ మున్సిపాటీకి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి అవార్డు దక్కింది. సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌కు అవార్డు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో గృహాల నుంచి బయటకు వస్తున్న ప్లాస్టిక్‌తో ఆర్‌డీఎఫ్ బ్రిక్‌లు తయారీ చేసి రాంకీ సంస్థకు విక్రయిస్తుంది. దీనిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సంపత్, పీసీబీ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించండి



అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అత్తాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి అత్తాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తుస్తూ ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థుల తల్లి దండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని వారికి కావాల్సిన నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా విద్యార్థులు నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్‌రావు, రజియాబేగం, సరళ, మీనాకుమారి, రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం



పోలీసులకు నచ్చచెబుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మణికొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ఉదయం భారత్ భవన్ శంకుస్థాపనకు కోకాపేటకు వస్తున్నట్లు తెలియడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే మీకెవరికీ అనుమతి లేదని, లోనికి పంపే ప్రసక్తే లేదని, ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేయడంతో నాయకులు, కార్యకర్తలు వారిపై తిరగబడ్డారు. ఏకంగా ఓ పోలీసు అధికారిని శంషాబాద్‌కు చెందిన ఓ నాయకుడు నెట్టి వేయటంతో ఆగ్రహానికి లోనైన సిబ్బంది అతడిని నెట్టుకుంటూ వెనక్కి తీసుకుని వచ్చారు. దీంతో పార్టీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. పోలీసు అధికారిని నెట్టిన వ్యక్తిని వాహనం ఎక్కించి అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధపడటంతో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వారిని మందలించి సదరు నాయకుడిని వెంట పెట్టుకుని లోపలికి వెళ్లారు.

శరవేగంగా కుంట అభివృద్ధి పనులు



అత్తాపూర్: అత్తాపూర్‌లోని అనంత పద్మనాభ స్వామి కుంట అభివృద్ధి పనులను శరవేగంగా కొనసాగుతున్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనులను శరవేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిశీలించి అధికారులతో చర్చించి సమస్యలకు పరిష్కారాలు చూపిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

అత్తాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ ప్లేజెంట్ పార్కు వద్ద ఉన్న వీధి దీపాలు గత కొంత కాలంగా వెలగడం లేదు. సోమవారం వాటిని పరిశీలించిన ఆమె మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా ప్లేజెంట్ పార్కు ప్రాంతంలో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికులు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో సోమవారం ఆ ప్రాంతంలో పర్యటించినట్లు తెలిపారు. వెంటనే అధికారులతో చర్చించి సిబ్బందితో మరమ్మతులు చేయించానన్నారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నార్సింగి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కృష్ణ



కృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

మణికొండ: నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఖానాపూర్ గ్రామానికి చెందిన సభ్యుడు తోలుకట్ట కృష్ణ నియమితులయ్యారు. గత ఎన్నికల్లో పీఏసీఎస్ చైర్మన్‌గా మంచిరేవులకు చెందిన మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, వైస్ చైర్మన్‌గా నెక్నాంపూర్ గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ గెలుపొందారు. ఇటీవల అధికారుల తీరును నిరసిస్తూ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో అధికారులు వైస్ చైర్మన్‌ను ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కొనసాగాలని ఆదేశాలు జారీ చేశారు. అతడిని చైర్మన్‌గా కొనసాగించటం ఇష్టం లేని మిగతా సభ్యులు అతనిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. సోమవారం జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్ ధాత్రి దేవి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో అతనిపై అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆయన పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అత్యధిక సభ్యులు కృష్ణ పేరును ప్రతిపాదించడంతో మొగ్గు అతడిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తి స్థాయి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎంపిక చేస్తామని అధికారులు పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానంలో సభ్యులు మాజీ వైస్ చైర్మన్ పి. సత్యనారాయణ, సభ్యులు ఎల్. అశోక్‌రెడ్డి, కె. విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ. నారాయణ, రమేష్, బిక్షపతి, మల్లేష్, టి. కృష్ణ, జి. రామకృష్ణారెడ్డిలతోపాటు ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొద్దు

అత్తాపూర్: అత్తాపూర్ హైదర్‌గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం తగదని ఆల్ పార్టీస్ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సుహాసిని అన్నారు. సోమవారం పాఠశాలలో సమావేశమైన హైదర్‌గూడ ఆల్ పార్టీస్ నాయకులు ఈ మేరకు తీర్మానం చేశారు. దాదాపు 200 మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. వేసవి సెలవుల్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మెను నిర్మించారన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. చిన్న పిల్లలు ఆడుకునే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. ఇప్పటికే 20 ఏళ్లుగా స్కూల్ గేట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ భద్రత లేక పోవడంతో చెత్తచెదారం, మద్యం బాటిళ్లతో నిండిపోయిందన్నారు. వీలైతే పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, మల్లారెడ్డి, రామేశ్వర్‌రావు, వనం నర్సింహ, సుధాకర్‌రెడ్డి, సాబాద విజయ్‌కుమార్, రవి, బిట్కూరి సిద్దేశ్వర్, వెంకటేష్, సాయియాదవ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్



అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై సోమవారం మండలంలోని పెద్దషాపూర్ పీహెచ్‌సీ ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలను ఎలా అడ్డుకోవాలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ జిల్లా మేనేజర్ అర్జున్, డాక్టర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు వేల మందికి అన్నదానం



శంషాబాద్: సామాజిక సేవకులు, వ్యాపార వేత్త కందకట్ల సిద్దురెడ్డి సోమవారం పట్టణంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. సంగీత మొబైల్స్ సమీపంలోని మైదానంలో మాంసాహార, శాఖా హార వంటకాలతో అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ సిద్దురెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గత 40 రోజులుగా ప్రజలకు మజ్జిగతో పాటు మంచినీళ్లు పంపిణీ చేసి దాహార్తిని తీర్చారన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్నదానానికి వచ్చిన వారికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సినీనటుడు ఇంద్రసేన, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్: కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సిద్దంతి ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న (40) వ్యక్తిని హైదరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజీఐటీలో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ సమ్మిట్



ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ సమ్మిట్‌లో పాల్గొన్న అధ్యాపకులు, పారిశ్రామిక వేత్తలు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్(హైదరాబాద్ చాప్టర్) సంయుక్తంగా సోమవారం కళాశాలలో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ సమ్మిట్ నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన మెటలర్జీ, మెటీరియల్స్ సంబంధిత పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామప్రసాద్, అసోసియేట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అధినేత సూర్యప్రకాశ్‌రావు, పరిశోధనా టెక్నాలజీస్ వ్యవస్థాపకులు సత్యనారాయణ, శరత్, కె.వరుణ్‌కుమార్, డాక్టర్ పవన్‌లు విద్యార్థులకు పారిశ్రామికరంగంలో వస్తున్న మార్పులు, వాటిలో రాణించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజనీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం



అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

అత్తాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉంటూ గత పదేళ్లుగా ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగించేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పోలీస్ స్టేషన్‌లను వివిధ కేటగిరిలుగా విభజిస్తూ స్టేషన్ అవసరాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందన్నారు. సైబరాబాద్, రాచకొండ సరిహద్దులను కలుపుతూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటైందని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఒక వైపు కార్వాన్, మరోవైపు మెహదీపట్నం, బహదూర్‌పురా, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల మధ్యలో ఉంటుందని సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందినందున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూకబ్జాలకు పాల్పడుతూ రౌడీషీటర్లుగా నమోదైన వారి నడవడికను ఎప్పటికప్పుడు పసిగడుతున్నామన్నారు. నేరాలకు పాల్పడే వారిపై అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమితులైన పులి యాదగిరికి స్వాగతం పలుకుతూ విధుల్లో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, మిద్దెల సురేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, విజయ్‌కుమార్, సి.హెచ్.అమరేందర్, సిద్దేశ్వర్‌లతో పాటు అడిషనల్ డీసీపీ రేష్మి పేరుమాల్, ఏసీపీ గంగాధర్, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పెండం మధు, డిఐ రాజేందర్‌గౌడ్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై కిషన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హైదర్షాకోట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులతో కలిసి బస్తీలు, కాలనీల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, చక్కగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి ప్రసన్నాంబ, అనిత, శ్రవంతి, అనురాధ, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భారీగా నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలను చూపుతున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పత్తి విత్తనాలను రైతులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు 1.5 టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భీమవరానికి చెందిన తోటకూర రంగారావు కర్నూలు జిల్లాలో స్థిరపడ్డాడు. కృష్ణగిరి మండలం, గోకులపాడు గ్రామంలో భూమిని కౌలుకు తీసుకున్న అతను ప్రభుత్వం నిషేధించిన బీజీ–111/ హెచ్‌టీ పత్తిని సాగు చేస్తున్నాడు. అనంతరం కర్నాటకలోని మిల్లుల్లో పత్తి గింజలను వేరు చేయించిన అతను వాటికి రసాయనాలు కలిపి సాధారణ పత్తి విత్తనాలుగా మార్చి రైతులకు విక్రయిస్తున్నాడు. షాద్‌నగర్ పరిసర గ్రామాల్లో పత్తివిత్తనాలు విక్రయించేందుకు వచ్చిన అతడిని శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు.

పదేళ్లుగా ఇదే దందా

రంగారావు దాదాపు పదేళ్లుగా నిషేధిత పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఆదిలాబాద్, తాండూరు ప్రాంతాల్లోనూ అతడిపై కేసులు నమోదైనట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని డీసీపీ సూచించారు. నకిలీలు, నిషేధిత విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. నకిలీ విత్తనాలు, నిషేధిత విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కేసును ఛేదించిన శంషాబాద్ ఎస్ఓటీ బృందాన్ని డీసీపీ అభినందించారు. సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, శంషాబాద్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.